క్లుప్తంగా

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు స్పందన



కోటవురట్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

కోటవురట్ల : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. కోటవురట్లలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య అంశాలు, వైద్యపరీక్షలపై వారికి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వైద్య సేవలు చేరువలో ఉండాలనే లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోటవురట్ల : కొత్త అమావాస్య పండగను పురస్కరించుకుని కె.వెంకటాపురంలో సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు రిబ్బన్ కత్తిరించి టోర్నీ ప్రారంభించి తొలిబంతిని ఆడి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఏటా కొత్త అమావాస్య సందర్భంగా వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తుల అందరి సహకారంతో జరుగుతున్న టోర్నీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రామసత్యనారాయణ పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే



కె.వెంకటాపురంలో ఫీవర్ సర్వే చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల : కె.వెంకటాపురంలో సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. హెచ్3ఎన్ వైరస్ వ్యాప్తితో దగ్గు, జ్వరం, ఊపిరి సమస్యలు తలెత్తుతున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఫీవర్ సర్వేకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాలు, వ్యాధులపై ఆరా తీస్తున్నారు. వైద్యాధికారి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు జ్వరాలు, దగ్గు లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్దనే చికిత్స పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మాస్కులు విధిగా ధరించాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు.

గవర్ల అనకాపల్లిలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మునగపాక : గవర్ల అనకాపల్లిలో గంగపరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా సోమవారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. దొడ్డి దిలీప్‌కుమార్, పిట్టా శ్రీను నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ ఆనందరావు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యక్తిగత సహాయ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న అప్పలరాజు

నక్కపల్లి : బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు తేజస్విని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సోమవారం సీబీడీ డీఎస్పీ కాళిదాసు సహకారంతో సుమారు 230 మంది విద్యార్థులకు సొసైటీ ఫౌండర్ పెన్నాడ అప్పలరాజు వీటిని అందజేశారు. విద్యార్థులు ఈ స్టడీమెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ శారద, సొసైటీ సభ్యులు లోవరాజు, కాకర కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్



కోటవురట్లలో బారులు తీరిన ఓటర్లు



కోటవురట్లలో పోలింగ్ సరళి తెలుసుకుంటున్న ఆర్డీవో జయరాం



ఓటు హక్కు వినియోగించుకుంటున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు



ఓటింగ్ సరళిని నాయకులను అడిగి తెల్సుకుంటున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



ఎస్.రాయవరంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న పట్టభద్రులు

కోటవురట్ల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోని బూత్ నంబరు 379 వద్ద ఉదయం 8 గంటలకే పట్టభద్రులు క్యూకట్టారు. ఎస్ఐ నారాయణరావు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. మధ్యాహ్నం 12 గంటలకు కేవలం 13 శాతం మాత్రమే పోలింగ్ జరగగా పోలింగ్ ముగిసే సమయం 4 గంటలకు 546 ఓట్లు పోలయ్యాయి. ఆ సమయానికి బూత్ వద్ద మిగిలిన 276 మంది ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్లిప్పులు పంచారు. ఆర్డీవో ఓహెచ్.జయరాం, డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. తహసీల్దారు జానకమ్మ, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలో 1092 పట్టభద్రుల ఓట్లు ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి 546 ఓట్లు పోలవ్వగా ఇంకా 276 మంది ఓట్లు వేసేందుకు వేచి ఉన్నారు. మొత్తంగా 80 శాతం పోలింగ్ నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరపున మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు పర్యవేక్షించారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో గల 186, 187 బూత్‌ల రూముల్లో పోలింగ్ జరిగింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పోలింగ్ సరళిని స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. సీఐ పి.అప్పలరాజు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఎవరినీ అనుమతించలేదు. నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్ కుమార్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా సాయంత్రం 4 గంటలు అయినప్పటికీ ఓటింగ్ జరుగుతుంది. అధిక సంఖ్యలో ఓటర్లు బారులు తీరడంతో ఆలస్యంగా ఓటింగ్ జరిగింది. 4 గంటలకే పోలీసులు గేట్లు వేశారు. 4 గంటలలోగా ఓటింగ్‌కి హాజరైన వారికి మాత్రమే ఓటింగ్‌కి అనుమతించారు.

74.8 శాతం పోలింగ్

పాయకరావుపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ 74.8 శాతం పోలింగ్ జరిగినట్లు మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ తెలిపారు. వివరాలిలా 1667 మంది ఓటర్లకు గాను 1234 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు బూత్‌ల్లో పోలింగ్ నిర్వహించడమైనది. బూత్ 186 లో 889 ఓటర్లకు గాను 688 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 464 మంది పురుషులు కాగా, 224 మంది మహిళలు ఓటు వేసారు. అదే విధంగా బూత్ నెంబరు 187 లో 778 మంది ఓటర్లకు గాను 532 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో 381 మంది పురుషులు కాగా, 151 మంది మహిళలు ఓటు వేసారు. మొత్తం 74.8 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు.

గంట గంటకూ పెరిగిన క్యూ

ఎస్.రాయవరం : మండలంలో పి.ధర్మవరం పాఠశాలలో సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ ఉత్సాహం సాగింది. మొదట 9 గంటలకు సాఫీగా సాగిన పోలింగ్ పట్టభద్రులు పెద్ద ఎత్తున రావడంతో వంద మీటర్లు మేర క్యూలైన్ పెరిగింది. అయితే పోలింగ్ బూత్ ఒక్కటే కావడం, ఒకే కౌంటర్‌లో వేయడం వల్ల పోలింగ్ ప్రక్రియ వేగం పెరగలేదు. గంట గంటకు క్యూ పెరుగుతుండడం, గంటల తరబడి సమయం పట్టడంతో కొందరు ఓటర్లు వెనుదిరగడం మొదలు పెట్టారు. గమనించిన తహసీల్యార్ శ్యామ్ ఫోన్‌లో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అదే బూత్ రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి వేసిన ఓటును ఒకే బాక్స్‌లో వేసేలా ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ వేగం పుంజుకుంది. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటు చేసి ఉంచారు. 188 పోలింగ్ పోలింగ్ బూత్‌లో 1131 ఓట్లు ఉండగా సాయంత్రం పోలింగ్ సమయం ముగిసే సరికి 453 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సిబ్బంది తెలిపారు. క్యూలైన్‌లో సుమారు 2 వందలకు పైగా ఓటర్లు వేచి ఉన్నారు. పోలింగ్ ప్రక్రియను నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు. ఓటర్లు ఓటుహక్కు వినియోగించునే సమయంలో కూడా తీసుకువచ్చి మొబైల్ ఫోన్లు రెవెన్యూ సిబ్బంది కౌంటర్ ఏర్పాటు చేసి భద్రపరచి, యథావిధిగా అప్పగించారు. దీంతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగింది.

ఎస్.రాయవరంలో 66.57 శాతం

ఎస్.రాయవరం : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 66.57 శాతం అయ్యిందని తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 7 గంటల 45 నిమిషాల వరకు కొనసాగింది. పోలింగ్ సమయం సాయంత్రం 4 గంటలకు ముగిసినప్పటికీ క్యూలైన్‌లో ఉన్న 135 మందికి స్లిప్‌లు ఇచ్చి ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. మొత్తం 1131 ఓట్లు ఉండగా 753 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పరుషులు 519 మంది కాగా, స్త్రీలు 234 మంది ఉన్నార న్నారు.

బారులు తీరిన పట్టభద్రులు



పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, సుకుమారవర్మ



ఓటు హక్కు వినియోగించుకునేందుకు మునగపాక హైస్కూల్లో వేచి ఉన్న ఓటర్లు



యలమంచిలి డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు కోసం బారులు తీరిన పట్టభద్రులు



మునగపాకలోని వైఎస్సార్‌సీపీ శిబిరం వద్ద ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్



అచ్యుతాపురం పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచి పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవడానిక పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టారు. యలమంచిలి డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరారు. యలమంచిలి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఎన్నికల సరళిని పరిశీలించారు. రాంబిల్లి, అచ్యుతాపురం,మునగపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సందర్శించారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు మునగపాకలో పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గపూర్, ఎస్ఐ మహమ్మద్ అలీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. మునగపాక, యలమంచిలి, అచ్యుతాపురం కేంద్రాల్లో రాత్రి 7గంటల తరువాత కూడా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేచి ఉన్నారు. విద్యుత్ లైటింగ్ మధ్య పోలింగ్ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ కూడా ఆయా కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు.

80 శాతానికి పైగా ఓటింగ్ నమోదు

మునగపాక : యలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సీ ఎన్నికల్లో 80.4శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 7 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 5923మంది ఓటర్లు ఉండగా 4765 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఓవరాల్‌గా 80.4శాతం పోలింగ్ నమోదైంది.యలమంచిలిలో మూడు పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 2354 మంది ఓటర్లకు గాను 1926మంది(81.8శాతం), అలాగే రాంబిల్లిలో 834 ఓటర్లు ఉండగా 696మంది(83.01 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే అచ్యుతాపురంలో రెండు పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 1496 మంది ఓటర్లు ఉండగా 1217మంది (81.3 శాతం)ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే మునగపాకలో 1239 మంది ఓటర్లకు గాను 926 మంది (74.3 శాతం)తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

7గంటల వరకు కొనసాగిన పోలింగ్

యలమంచిలి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భారీగా తరలివచ్చారు. 182 182ఎ183 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటలు తర్వాత కూడా భారీ సంఖ్యలో ఓటర్లు క్యూ లైన్లలో భారులు తీరారు. 4గంటలు లోపు పోలింగ్ కేంద్రంలోకి వచ్చి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యలమంచిలి డిగ్రీ కళాశాలలో 3 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 7గంటలు వరకు ఓటు వేశారు. యలమంచిలి పట్టణం,రూరల్‌లో 2354 మంది పట్టభద్రులు ఓటర్లకు గాను 1926 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పరవాడ డీఎస్పీ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

83.4శాతం పోలింగ్

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అచ్యుతాపురం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(అచ్యుతాపురం)లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలికి గానూ మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 197,198 పోలింగ్ కేంద్రాల్లో 83.4 శాతం పట్టభద్రులు ఓటు వేశారు. మొత్తం 1496 ఓటర్లకు గానూ 1217 మంది ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల పరిస్థితిని డీఎస్పీ శ్రీనివాసరావు ఆరా తీశారు.

ఉత్సాహంగా తరలివచ్చిన ఓటర్లు



నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో క్యూలో వేచి ఉన్న ఓటర్లు



తమ రెండేళ్ల కుమార్తెతో వచ్చి ఓటు వేసిన దంపతులు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సీపట్నం ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్

నక్కపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంతా జరిగింది. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగియాల్సి ఉండగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు క్యూలో వేచి ఉండడంతో సమయం ముగిసిన తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత క్యూలో ఉన్న వారందరికీ ప్రత్యేకంగా స్లిప్పులు అందజేసి ఓటు హక్కు వినియోగించుకునే వరకు పోలింగ్ కొనసాగించారు. ఉదయం మందకొడిగా జరిగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి జోరందుకుంది. సచివాలయ సిబ్బంది, నిరుద్యోగులు, వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నక్కపల్లి మండలంలో మొత్తం 1118 మంది పట్టభద్రులు ఉన్నారు. వీరికోసం నక్కపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 853 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 655 మంది, మహిళలు198 మంది ఉన్నారు. 76.29 శాతం పోలింగ్ నమోదయింది. 184 పోలింగ్ కేంద్రంలో మొత్తం 573 ఓట్లకు గాను సాయంత్రం ఐదుగంటలకు 463 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 361 మంది, మహిళలు 102 మంది ఓటు వేశారు. ఈ బూత్‌లో 80.80 శాతం పోలయింది. 185వ పోలింగ్ బూత్‌లో మొత్తం 545 మందికి 390 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 294 మంది, మహిళలు96 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాలను నర్సీపట్నం ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్, నక్కపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీరజ, ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. పాయకరావుపేట సీఐ అప్పలరాజు, నక్కపల్లి ఎస్ఐ శిరీష అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొబైల్‌ఫోన్‌లను అనుమతించలేదు. పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ సందర్శించారు. పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత నక్కపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. వేంపాడుకు చెందిన దంపతులు కొల్లి అచ్చిరాజు దుర్గాభవానీలు తమ రెండేళ్ల చిన్నారిని తీసుకుని ఓటువేయడానికి వచ్చారు. బంగారయ్యపేటకు చెందిన వికలాంగుడు గోసల కాశీరావు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నాడు.

కవయిత్రి మొల్లకు ఘన నివాళి



పుస్తకాలు అందజేస్తున్న రమణబాబు, అప్పారావు

మాడుగుల: సత్యవరంలో సహజ పండితురాలు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు రమణబాబు మాట్లాడుతూ మొట్ట మొదటిగా తెలుగులో రామాయణం, తదితర మహా గ్రంథాలు రచించిందని కొనియాడారు. ప్రతి విద్యార్థి కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదవాలన్నారు. అంతకు ముందు మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 50 మంది పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి, ఉప సర్పంచ్ వి. పెంటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు జనపరెడ్డి అప్పారావు, శనివాడ వెంకటరమణ, కరకపాటి నూకరాజు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట



జంగాలపల్లిలో కందకాలు తవ్వుతున్న పొక్లెయిన్

మాకవరపాలెం: ఇసుక అక్రమ తవ్వకాలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. జంగాలపల్లిలో సర్పానదిని ఆనుకున్న భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలకు ఎలాంటి వాహనాలు వెళ్లకుండా జేసీబీతో కందకాలు తవ్వించినట్టు ఎస్ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

నేడు గంగ పరదేశమ్మ తల్లి పండగ

ఆకట్టుకున్న వాలకాలు



గవర్ల అనకాపల్లిలోని గంగ పరదేశమ్మ తల్లి



వాలకాల ప్రదర్శన

మునగపాక : గవర్ల అనకాపల్లిలో మంగళవారం గంగ పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వాలకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పెళ్లిగోల(ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుడు), నూకాలమ్మ అమ్మవారి చీరల అమ్మకం వంటి వాటిపై వాలకాలు నిర్వహించారు. ఆళ్ల రమణావు, శివాజీ, మహేష్, రాజు తదితరుల ఆధ్వర్యంలో ఈ వాలకాల కార్యక్రమం నిర్వహించారు. వాలకాలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నామని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

22న భావనారుషి, భద్రావతిల కల్యాణం



భావనారుషి, భద్రావతి కల్యాణ పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : తోటాడ గ్రామంలో ఈ నెల 22న భావనారుషి, భద్రావతిల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు దొడ్డి త్రినాథ్, సన్యాసిరావు, తాతబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ పురాతన భావనారుషి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. 22న రాత్రి 7 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుందన్నారు. 23న ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. అదే రోజు స్వామి వారి పల్లకి ఊరేగింపు, ఊయల సేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

నూకాంబిక గరగ ఊరేగింపు



కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన కశింకోట నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయం నుంచి గరగలు, అమ్మ వారి పాదాలను అందంగా అలంకరించిన రిక్షాలో నిలిపి సంప్రదాయంగా డప్పులతో గ్రామంలో ఊరేగించారు. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. ఊరేగింపు అనంతరం గరగ, పాదాలను ఆలయంలో యథావిధిగా నిలిపారు. ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్, వేగి రామరాజుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక



నియోజకవర్గ యాదవ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా బోడి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గొల్లవీధి శ్రీ సీతారామదేవస్థాన కల్యాణ మండపంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా ఒమ్మి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మొల్లి రమణ, గోకువాడ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా గొలగాని సత్తిబాబు, కార్యదర్శులుగా గోకువాడ నాగేశ్వరరావు, బొట్ట చిన్న, కోశాధికారిగా కారుకొండ కన్నాయాదవ్, అధికార ప్రతినిధిగా కుండల రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా పళ్ల దుర్గారావు, సమన్వయకర్తగా గొలగాని అయ్యబాబుతో పాటు 13మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటరావు మాట్లాడుతూ కమిటీ మూడేళ్లపాటు మనుగడలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పందేలు

మాడుగుల రూరల్: వీరనారాయణంలో భక్తాంజనేయ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు, గుర్రపు పందేలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామని వారు తెలిపారు.

నేడు మోదకొండమ్మ తీర్థం



మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నేల వేషాలు, విద్యుత్ లైటింగ్ నడుమ అమ్మవారి తీర్థం జరగనుందన్నారు.